క్లుప్తంగా

14 అర్జీలు స్వీకరణ

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై 14అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్ ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ చాముండేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, హెచ్ఓ ఆర్.హేమ, కోఆపరేటివ్ అధికారి నాగలక్ష్మి, ట్రిపుల్ ఐటీ ఎస్సై కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్ కాంప్లెక్స్ వద్ద అన్నదానం

మైలవరం:డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద బాటసారులకు దప్పిక తీర్చే కార్యక్రమంలో భాగంగా గత నెల రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి పలువురు దాతలు సహకరిస్తున్నారని తెలిపారు. వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు సందర్భంగా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తేజస్వి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని సతీష్‌బాబు, ఎన్ఆర్ఐ మస్తాన్ పాల్గొన్నారు. 9 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు గ్రామ పెద్దలు అభినందించారు. దేవరపల్లి తిరుపతిరెడ్డి, కోట వేణుగోపాలరెడ్డి, ఐనీడ్స్ పుల్లారెడ్డి, ఏ.చంద్రం, డీటీడీసీ మల్లిఖార్జునరావు, మల్లిఖార్జున్‌రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలని ధర్నా



తిరువూరు:కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం గంపలగూడెం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున నివేశనస్థలాలిస్తామని హామీ ఇచ్చిన కూటమి పాలకులు ఇప్పటికి ఏడాది గడచినా నెరవేర్చకపోవడం తగదని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి నాగుల్‌మీరా పేర్కొన్నారు. సీపీఐ నాయకులు, నివేశనస్థల లబ్ధిదారులు పాల్గొన్నారు.

భూములను పేదలకు పంచాలి....

ఆగిరిపల్లి: నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత నెలలో చిన్న ఆగిరిపల్లిలో భూ స్వాధీన ఉద్యమం ద్వారా గ్రామంలో అసైన్డ్, సీలింగ్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు సహకారం అందించారు. సోమవారం వారితో పాటు దుక్కు దున్ని విత్తనాలు జల్లారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆస్కార్ అప్పలస్వామి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి నివారణ



నూజివీడు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం యోగాసనాల అభ్యాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. యోగాను ప్రతిరోజూ సాధన చేయడం వల్ల ఒత్తిడిని సులువుగా అధిగమించవచ్చన్నారు. మానసికంగా, ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):కుక్కల దాడిలో ఐదేళ్ల బాలుడు గాయపడిన సంఘటన కొండపల్లి పొట్టిశ్రీరాములు మార్కెట్ సెంటర్‌లో సోమవారం జరిగింది. తన తల్లితో కలిసి మార్కెట్‌లో సరుకుల కోసం వచ్చిన బాలుడు గగన్‌పై అనూహ్యంగా కుక్కలు దాడి చేశాయి. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాలుడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను నిర్మూలించాలని డిమాండ్ చేస్తున్నా స్పందన లేదు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదలు మృతి

చాట్రాయి: విద్యుత్ షాక్‌తో పాడి గేదెలు మృతి చెందాయి. మండలంలోని చాట్రాయిలో నరశింగ పుల్లయ్యకు చెందిన 2 పాడి గేదలకు ఆదివారం రాత్రి ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాయి. సుమారు రూ 1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు చెప్పారు.

పైలెట్ ప్రాజెక్టుకు మంగళం!

- మంజూరు కాని నిధులు
- పైపులైన్లు వేసి చేతులు దులుపుకున్న అధికారులు
- తాగునీటి సమస్యతో తిరువూరు ప్రజలు సతమతం



తిరువూరులో పైలట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టి పునాదిదశలో నిలిచిపోయిన ఓవర్‌హెడ్ రిజర్వాయర్

తిరువూరు: పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కరించడానికి గత ప్రభుత్వంలో చేపట్టిన కృష్ణా నదీ జలాల సరఫరా పైలెట్ ప్రాజెక్టుకు గత ఏడాది కాలంగా నిధులు కేటాయించకపోవడంతో అటకెక్కింది. 2015లో తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ ఈ పైలెట్ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపగా 2019లో ఆమోదం లభించింది. నిధులు మంజూరు కాకుండానే ఏడీబీ నుంచి రూ.50 కోట్ల ఆర్థిక సాయం వచ్చిందంటూ ఈ పైలెట్ ప్రాజెక్టు పనులను అప్పటి పాలకవర్గం చేపట్టింది. ఇబ్రహీంపట్నం వద్ద ఫెర్రీ నుంచి కృష్ణా నదీ జలాలను తిరువూరు వరకు పైపులైన్ల ద్వారా సరఫరా చేయడానికి ఈ పథకాన్ని నిర్దేశించారు. కానీ, ఈ పథకానికి సకాలంలో నిధులు కేటాయించకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ప్రతిపాదనలు పంపారు. అంచనాలు పెంచి రూ.120 కోట్లతో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవకాశం ఉందని మున్సిపల్ పబ్లిక్ వర్క్స్ విభాగం అంచనా వేసింది. ఈ మేరకు ఏడీబీ గ్రాంటు మంజూరవుతుందని భావించి ముందుగా కాంట్రాక్టరు తిరువూరులో పైపులైన్ల విస్తరణ, ఓవర్ హెడ్ రిజర్వాయరు పనులను చేశారు. ఇంతలో ఎన్నికలు సమీపించడంతో పైలట్ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి.

అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు..

తిరువూరుకు దీర్ఘకాలంగా తాగునీరందించే కట్టలేరు వాగుకు ఎగువన తెలంగాణ ప్రభుత్వం లంకాసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయరు, బేతుపల్లి చానల్ నిర్మాణం జరపడంతో గత 10 సంవత్సరాలుగా మంచినీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయి. దీనికితోడు జనాభా పెరుగుదల, శివారు ప్రాంతాల అభివృద్ధితో రక్షిత మంచినీటి సరఫరా అరకొరగా జరుగుతోంది. వేసవిలో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేయడంతో సరిపెడుతున్న అధికారులు రక్షితనీటి సరఫరాకు శాశ్వత ప్రాజెక్టు ఏర్పాటులో నిర్లక్ష్యధోరణి అనుసరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు చేపట్టడానికి రూ.190 కోట్ల వ్యయం అవుతుందని, నిర్వహణ వ్యయం కూడా తలకు మించిన భారమవుతుందని భావిస్తున్న నగర పంచాయతీ అధికారులు ప్రాజెక్టు పనులకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

నిధులు కేటాయించాలి



తిరువూరు పట్టణానికి రక్షిత మంచినీటి సరఫరా చేయడానికి కృష్ణానది నుంచి నీరందించే పైలట్ ప్రాజెక్టు ఇకనైనా పూర్తిచేయాలి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలి. ఏటా వేసవిలో పట్టణ ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– కాలసాని విజయలక్ష్మి, తిరువూరు

నిర్లక్ష్యం తగదు



ప్రజలకు తాగునీరందించడంలో నగర పంచాయతీ అధికారులు నిర్లక్ష్యధోరణి అనుసరించడం తగదు. గతంలో పలుమార్లు పైలెట్ ప్రాజెక్టు పనులు ప్రారంభించడం, నిలిపివేయడం పరిపాటైంది. ఇకనైనా నిర్దిష్ట ప్రణాళికతో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చాలి.

– మాలపాటి ఉదయ్, తిరువూరు

ప్రభుత్వ కార్యాలయాల్లో పడకేసిన పాలన



కాచవరం సచివాలయం తాళాలు మధ్యాహ్నం వరకు తీయకపోవడంతో వేచి ఉన్న ప్రజలు



ఇబ్రహీంపట్నంలో ఉదయం 11గంటల వరకు తీయని ఎంపీడీవో కార్యాలయం తాళం

ఇబ్రహీంపట్నం:మండలం పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పాలన పడేసింది. దీంతో ప్రజలకు సేవలు అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం ఉద్యోగులు సమయపాలన లేకపోవడంతో కార్యాలయాల తాళాలు సమయానికి తీసేవారు కరువయ్యారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం సుమారు 11 గంటలకు వరకు తీయలేదు. వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారు అవస్థలు పడ్డారు. కనీసం సమాచారం చెప్పేవారు లేక వెనుతిరిగి వెళ్లిపోయారు. కాచవరం గ్రామ సచివాలయం తాళాలు కూడా మధ్యాహ్నం 12 గంటల వరకు తీయలేదు. వివిధ పనులపై వచ్చిన స్థానికులు కార్యాలయం వద్ద పడిగాపులు పడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి 4వేల మందికి ఒక గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు గ్రామంలోనే అందించేలా ఒక్కొక్క సచివాలయంకు 9నుంచి 11మంది ఉద్యోగులను నియమించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సర్దుపాటు, వివిధ రకాల సర్వేల పేరుతో పాలన పడకేశాలా చేశారు. సకాలంలో సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాళాలు తీసే దిక్కులేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నారు. ఈవిషయంపై ఎంపీడీవో సునీత శర్మను వివరణ కోరగా, విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో సమావేశానికి ఆమె హాజరైనట్లు తెలిపారు. ఇద్దరు సిబ్బంది కౌన్సిలింగ్‌కు హాజరైందుకు వెళ్లారన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ తదితరులు

జి.కొండూరు:ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ , ఎంపీడీఓ రామకృష్ణ నాయక్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. గత కొద్ది నెలలుగా మీటింగ్ హాల్‌లో శ్లాబు, గోడల పెచ్చులు ఊడి దెబ్బతినడంతో మండల సర్వసభ్య సమావేశాలు స్థానిక కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం రిపేర్ వర్క్స్ మొదలు పెట్టారు. మరి కొద్ది రోజుల్లో సమావేశ మందిరం మరమ్మతులు పూర్తవుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజలకు కూటమి వెన్నుపోటు

నూజివీడు: కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. ఈ నెల 4న వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం వైఎస్సార్ సీపీ స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మొత్తం అప్పులో 44 శాతం అప్పుని ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. అయినా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా, అభివృద్ధి చేయకుండా ప్రజల నెత్తిన భారాలను మోపుతోందన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, నాయకులు బసవా వినయ్, చేబత్తిన మున్నా, చలపతిరావు, షేక్ యూనస్‌పాషా, పిళ్లా చరణ్, సలుమూరు మూర్తి, కాలి సుగుణరావు, కృపారావు, కొల్లేపల్లి ఆదినారాయణ, దామెర జోగారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడదామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. ఆగిరిపల్లిలో సోమవారం వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు మాట్లాడుతూ 4న నూజివీడులో జరిగే వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ కార్యక్రమానికి తరలిరావాలని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ పిన్ని బోయిన వీరబాబు, వైస్ ఎంపీపీ కొండ వరదలు రమేష్, నాయకులు అత్తి మురళి, దిలీప్ కుమార్, ఈలప్రోలు సుబ్బయ్య, నందూరు భాస్కర్ ప్రసాద్, రాణిమేకల సత్యనారాయణ, సుజన కుమారి, నక్కనబోయిన శ్రీమన్నారాయణ, సుభాని పాల్గొన్నారు.



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నాయకులు

అబద్ధపు హామీలతో కూటమి నయవంచన





జి.కొండూరు, రెడ్డిగూడెంలో వెన్నుపోటు దినోత్సవ వాల్‌పోస్టర్‌ని విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.కొండూరు:అబద్ధపు హామీలతో ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు జూన్ నాల్గో తేదీన నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు ఆధ్వర్యంలో జి.కొండూరులో సోమవారం వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ కేడీసీసీ వైస్ చైర్మెన్ వేములకొండ రాంబాబు, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు, సర్పంచ్‌లు మండల అరుణ, ఉమ్మడి ప్రసాద్, పిల్లి రామారావు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్, నాయకులు చెన్నూరు సుబ్బారావు, గంగుల తిరుపతిరావు ఇతర నాయకులు పాల్గొన్నారు. రెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవ వాల్ పోస్టర్‌ని సోమవారం విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నాల్గో తేదీని నియోజకవర్గ కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు కలకుంద వెంకటరామారావు, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, ఎంపీటీసీ సభ్యుడు కుప్పిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

వెన్నుపోటు దినం జయప్రదం చేయాలి

మైలవరం:మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మైలవరం ఎల్ హెచ్ కాంప్లెక్స్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మూడు పార్టీలు కలిసి కట్టుగా రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆధ్వర్యంలో 4న నియోజకవర్గం వ్యాప్తంగా వెన్నుపోటు దినంగా పాటించి నిరసన తెలపాలని కోరారు. 4న ఉదయం 9గంటలకు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కాంప్లెక్స్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకుని జోగి రమేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు అప్పిడి సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, మైలవరం పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డి, మైలవరం ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, మాజీ మైలవరం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్. దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించమంటే అరెస్టులా?



వెల్వడంలో సీపీఎం నాయకుడు సుధాకర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

మైలవరం:అధ్వానంగా ఉన్న ఆర్ అండ్ బీ రహదారి సమస్య పరిష్కరించమంటే అరెస్టులు చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మైలవరం నుంచి నూజివీడు వెళ్లే రహదారి పనులు నాలుగు నెలలు క్రితం ప్రారంభించి అప్పటి నుంచి గాలికి వదిలేశారన్నారు. కొత్త రోడ్డు వేస్తామని చెప్పి పాత రోడ్డును తవ్వేసి, గ్రావెల్, కంకర తోలించి పనులు చేయకుండా గాలికి వదిలేసి, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సీపీఎం నాయకులు వెల్వడం గ్రామంలో స్థానికులతో కలిసి సోమవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తహసీల్దారు అబ్దుల్ దరియా సంఘటనా స్థలానికి చేరుకుని సీపీఎం నాయకులు, గ్రామస్తులతో చర్చలు జరిపారు. సీపీఎం నాయకుడు సుధాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మైలవరం:లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్వీఎస్ హౌస్‌లో సోమవారం పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎస్వీఎన్ నివృతరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడిగా చనమోలు నాగభూషణం, సెక్రటరీగా శీలం రామిరెడ్డి, ట్రెజరర్‌గా చలువాది గుప్తా హరీష్ కుమార్, జోన్ చైర్మన్‌గా తిరుమలశెట్టి శ్రీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లారీ ఢీకొని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు గాయాలు

ఇబ్రహీంపట్నం: టిప్పర్ ఢీకొని ఎన్టీటీపీఎస్ ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడిన ఘటన గుంటుపల్లి వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.... కానిస్టేబుల్ శ్రీనివాసరావు విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వస్తున్న క్రమంలో వెనుక వైపు నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన గాలికి గాయం కాగా స్థానికులు వైద్యశాలకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చాట్రాయి: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని చనుబండ విద్యార్థులు ప్రతిభ చాటారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గంగా వైష్ణవి ప్రథమ స్థానం, మోరంపూడి వల్లిక, రెబ్బు ఉమాసాయి వీక్షిత్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు కోచ్ మరకాల రేవంత్ తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా

ఆగిరిపల్లి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విద్యార్థులు ఆలిండియా స్థాయిలో సత్తా చాటారు. ఆగిరిపల్లికి చెందిన మానేపల్లి సుమేద్ ఆలిండియా 255 ర్యాంకు సాధించాడు. చొప్పరమెట్లకు చెందిన మంజునాథ్ 471 ర్యాంకు సాధించాడు.

శ్రీకృష్ణ ఆలయంలో హోమం

ముసునూరు: భక్తుల గోవింద నామ స్మరణలు, వేద మంత్రోచ్చరణలు, మంగళ వాద్యాలు నడుమ చెక్కపల్లిలో నిర్మితమైన శ్రీకృష్ణ పరమాత్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం హోమం నిర్వహించారు. గురువారం జరగనున్న స్వామివారి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠను పురస్కరించుకుని విశేష పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు.

బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు

నూజివీడు: ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా మండలంలోని పలు హైస్కూళ్లకు నూతన హెచ్‌ఎంలు నియమితులయ్యారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్‌ఎం భాగవతుల హేమలత ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి జెడ్పీ బాలికల హైస్కూల్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో మండలంలోని మీర్జాపురం హైస్కూల్ హెచ్‌ఎం డీవీఎల్ పుష్పలత నియమితులయ్యారు. గొల్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి ఉంగుటూరు మండలం ఆత్కూరు హైస్కూల్‌కు బదిలీకాగా ఆమె స్థానంలో విజయవాడ పటమట హైస్కూల్ నుంచి జి.శారద హెచ్‌ఎంగా నియమితులయ్యారు. మీర్జాపురం హైస్కూల్ హెచ్‌ఎంగా విజయవాడ రూరల్ మండలం నిడమానూరు హైస్కూల్‌లో ఇంగ్లీష్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోనేరు శ్రీదేవి నియమితులయ్యారు. పడమరి దిగవల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.శోభారాణి ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా బదిలీ కాగా, ఆమె స్థానంలో కృష్ణా జిల్లా గన్నవరం మండలం దావాజీగూడెం హైస్కూల్‌లో గణిత అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వై.సునీత పదోన్నతిపై హెచ్‌ఎంగా నియమితులయ్యారు. నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం వీవీఎస్ సత్యనారాయణ విజయవాడ పటమట బాలుర హైస్కూల్‌కు బదిలీకాగా ఆయన స్థానంలో ముసునూరు మండలం కాట్రేనిపాడు హైస్కూల్ హెచ్‌ఎం బీ అనురాధ నియమితులయ్యారు.

కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



నూజివీడు: పట్టణంలోని విక్టోరియా పుర మందిరం ఆవరణలోని బాస్కెట్ బాల్ కోర్టు వద్ద కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అండర్–23 బాలుర, బాలికల జట్టును సోమవారం ఎంపిక చేశారు. బాలికల జట్టుకు నూజివీడుకు చెందిన బి.ప్రభుదీపిక, షేక్ అస్రా, బి.ప్రణవి, బి.కుసుమ, బాలుర జట్టుకు నూజివీడుకు చెందిన ఎ.తేజ, బి. సంజయ్, షేక్ యాసిన్, విజయవాడకు చెందిన నగేష్‌బాబు ఎంపికయ్యారు. ఈ రెండు జట్లు ఈ నెల 4, 5 తేదీల్లో చిత్తూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో కృష్ణా జిల్లా జట్టు తరపున పాల్గొంటారని అసోసియేషన్ సెక్రటరీ డి.సత్యనారాయణ తెలిపారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

ముసునూరు: పాఠశాల చిన్నారులకు మెనూ ప్రకారం రుచికరంగా వండి వడ్డించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు సూచించారు. ముసునూరు హైస్కూల్ ప్లస్‌లో సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, వంట వండేవారు, సహాయకులకు ఒక రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. ఆహార పదార్థాలను రుచికరంగా తయారు చేసి, చిన్నారులకు వడ్డించాలని ఆదేశించారు.

వివాదాస్పద స్థల పరిశీలన

చాట్రాయి: వివాదాస్పద పోల్ట్రీ భూములను జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పరిశీలించారు. మండలంలోని చీపురుగూడెం వివాదాస్పద భూమిని సోమవారం ఆమె పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఫారెస్ట్ భూమి సర్వే చేసి బౌండరీలు గుర్తించాలని అధికారులకు సూచించారు.